# శారద

రచన : "మాధవ్"

(గత సంచిక తరువాయి)

భోజనం వడ్డించడం, కాఫీ ఇవ్వటం మొదలైనవి శారదే చెయ్యవలసి వచ్చింది. బామ్మకి కండ్లు సరిగా కనపడవు. అమ్మకి ఇలాటివి తెలియవు. వంటవరకే ఆవిడ డ్యూటీ ఆవిడొక సజీవ ప్రతిమ. స్వతంత్రంగా ఏపనీ చెయ్యలేదు. ఇదీ శారదకి మంచిదే అయింది. తెల్లవారి వెళ్ళిపోతాడనగా అన్నయ్య, శ్రీధర్ రెండవ ఆట సినిమాకి వెళ్ళారు. వచ్చేటప్పుడు 'మల్లీశ్వరి' పాటల పుస్తకము కొని తెచ్చి దానిమీద 'శ్రీధర్' అని వ్రాసి టేబిల్ మీద పెట్టాడు. ఉదయం తొమ్మిది గంటలకి స్నానం అన్నీ పూర్తిచేసుకొని, పెట్టె బెడ్డింగు సర్దుకొని బామ్మతోను. అమ్మతోను వెళ్ళివస్తానని చెప్పి ఇంకా ఎవరికోసమో అతని కళ్ళు వెతుకుతున్నాయి. ఫణి తొందర చేస్తున్నాడు. అంతలో శారద ట్యూషన్‌కి వెళ్లాలని పుస్తకాలకోసం ఆగదిలోకి వచ్చింది. అతను వెతుకుతూ ఉన్నది కనిపించినట్లు ఆనందంతో మెరిసేకళ్ళతో "వెళ్ళివస్తానండీ" అంటూ ఎవరితోనో చెప్పినట్టు చెప్పి ఆమె ముఖం చూసే దుకే అన్నట్టు నిలబడిపోయేడు. శారద వెంటనే తలఎత్తి చూసింది. అంతే నాలుగు కళ్ళూ కలుసుకున్నాయి. ఎంత విడదీసినా విడివడలేదు. మూగమనసులు కళ్ళలోనే ఏం మాట్లాడుకున్నాయో వాళ్ళకే తెలుసు. ఫణి తొందరచేయగా శ్రీధర్ విధిలేక వెళ్ళినట్లు వెళ్ళిపోయేడు.

* * * *

కాలప్రవాహంలో మరో మూడేళ్లు దొర్లిపోయాయి. పరీక్షా ఫలితాలు తెలిశాయి. శ్రీధర్‌కి ఆనర్స్ ఫస్ట్ క్లాసు వచ్చింది. ఫణికి సెకండ్ క్లాసు వచ్చింది. ఫణి ఏదో కంపెనీలో కెమిస్టుగా చేరిపోయాడు. శ్రీధర్‌ని మాత్రం విద్యాదాహం వీడక, పి. హెచ్. డి. వరకు వెళ్ళడం అంతటితో ఆగిపోక విదేశాలకు వెళ్ళే ప్రయత్నం ఇవి అన్నీ మద్రాసులో సాగాయి. ఈ మధ్యకాలంలో ఒకటి రెండుసార్లు రావడం, ఫణిని కలియడం జరిగేయి శారదకి మాత్రం చూసే అవకాశం చిక్కలేదు. శారద మాత్రం ఎలాటి పరిస్థితిలోనైనా తను డిగ్రీ పుచ్చుకుందాం అనుకున్న కోర్కె నెరవేర్చుకుందికి అనేక ప్రయత్నాలు చేసి బి. ఏ. ప్రయివేటుగా పాసయింది. కాలంగమనంలో అనేక సంఘటనలు దొర్లుతూఉంటాయి. శ్రీధర్ తన స్వయంకృషివల్ల అట్టే శ్రీమంతుడు కాకపోయినా ప్రభుత్వ సహాయంతో అమెరికా వెళుతూ ఫణిని కలుద్దామని వచ్చేడు. మాటల సందర్భంలో శారద బి. ఏ. పాసయినట్టు బామ్మ చెప్పింది. శ్రీధర్ పట్టలేని సంతోషంతో నిజంగానా! ఎం. ఏ. తప్పకుండా చదివించండి, అని బామ్మతో చెబుతూ దేన్నో వెతుకుతూ ఉన్నట్టు నలుదిక్కులా కలయచూశాడు. ఇంతలో కాఫీ కప్పులో శారద అటురావడం చూసి, "కంగ్రాజులేషన్" అంటూ "ఎం. ఏ. తప్పకుండా చదవండి" అని శారదని ఉద్దేశించి అన్నాడు. ఇంతలో ఫణి వచ్చి శ్రీధర్‌ని ఎక్కడికో తీసుకొని వెళ్ళిపోయేడు. అంతే మళ్ళీ నేటివరకు కంటబడలేదు. ఎప్పుడైనా లెటర్సు వస్తూవుండేది. శారద అతని కోరిక ప్రకారం ఎం. ఏ. చదవాలని అనుకున్నా ఇప్పటికే తనకి పెళ్ళికి సంబంధం తేలేక చస్తున్నాం అని ఇంక [illegible] అన్నయ్యలు, బామ్మ శాసించడంతో చదువుకు స్వస్తి చెప్పి ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూచోవడం అయిపోయింది. నాటినుండి నేటివరకు ఎన్నో సంబంధాలు చూడ్డం, ఏదో ఒక లోపం ఉన్నదేగాని ఏదీ ఇది చేసుకుంటే బాగుండునని అన్నదిలేదు. ప్రతిసారి సంబంధం తప్పిపోయినప్పుడు శారద ఎంతో సంతోషించేది. ఎన్నటికైనా శ్రీధర్ అమెరికానుండిరాకపోతాడా తన మనస్సు విప్పి చెప్పే అవకాశం రాకపోతుందా! అని సంతసించిపోతూ ఉండేది. ఊహాలలోమాత్రం నిజంగా ఏ దంపతులు పొందని అనుభూతులు పొందుతూ ఉండేది.

* * *

ఎవరికోసం కాలచక్రం ఆగిపోదుకదా! రైలుబండి పరుగెత్తి పరుగెత్తి అలసిపోయి కాస్త విశ్రాంతి తీసుకొందుకి దప్పిక తీర్చుకొందుకి ఏలూరులో ఆగిపోయింది. అంతవరకు భుజంగం ఎవరో ఎదుటి సీట్లో ఒంటరిగా ప్రయాణంచేస్తూఉన్న వ్యక్తికి కంపెనీ ఇస్తూ ప్రపంచంలో పరీక్షా విధానాలు, విద్యావిధానాలు, ఎలక్షన్లు నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనే విధానాలు అన్నీ విమర్శిస్తూ తనతో మరో వ్యక్తి ఉందని, ఆమె ఒంటరిగా ఉందని మరచిపోయేడు. అతనికిఅది అలవాటే. సిగరెట్ ముట్టించి ఎవరైనా రెండు చెవుల మధ్య బుర్రఉన్న మనిషి దొరికితే మరి వదలడు. అతను రైలు ఆగవడే తడవుగా వెళ్ళి మూడుమీల్స్‌కి ఆర్డరిచ్చేందుకు వెళుతూంటే భుజంగం వారించి తనే సొమ్ము చెల్లించి కంపార్టుమెంటులోకి వచ్చి శారద ప్రక్కనే కూర్చుంటూ, ఆమె భుజం మీద చెయ్యివేసి, సారీ శారదా! నువ్వు ఏదో చదువుకొంటున్నావుగా అందుకు అతనితో మాటల్లోపడి మరచే

పోయాను ఏం? వంటరిగా ఫీలయ్యావా? పోనీ కలసి భోజనం చేద్దాం. అని అంటూ ఆమె చెయ్యిపట్టుకొని లేవనెత్తి వాషింగ్ బేసిన్ వద్దకు చేతులు కడుక్కుండికి తీసుకెళ్ళాడు. ఏం? కోపం వచ్చిందా? కొంచెం మాట్లాడుదూ! ఇంటికి వెళ్ళాక నీ యిష్టం వచ్చినట్టు. అలకలు, మానాలు సాగించవచ్చు. అంటూ కొంచెం నీళ్లు తీసి శారదపై చల్లాడు.

"అయ్యో! ఏం మాట్లాడను? ఏంమనిషి? ఎదుటిమనిషి ఉద్దేశంకూడా తెలుసుకోలేని అజ్ఞానా? లేక ఏంచేస్తుంది అందరిలా, నడుచుపోతుంది." అని అనుకొంటున్నాడా? నాకు ఆకలిగా లేదు. నేను భోంచెయ్యను. అంటె మొండిగా తినిపించేలాగుంది ఇతని వైఖరి. పోనీ ఇదీ జీవితంలో ఒక అనుభవం. అతన్ని చిన్నబుచ్చడం ఎందుకు? అని అనుకుంటూ అతనితో ఒకటి అరా మాట్లాడుతూ భోజనం ముగించింది. అంతలోనే తోటిప్రయాణీకుడు రెండు కిళ్ళీలు తెచ్చి భుజంగం చేతికిచ్చాడు. భుజంగం నవ్వుతూ అవి శారద చేతిలో పెట్టి చెయ్యి కడుక్కొనివచ్చి ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. శారద అది గ్రహించి ఒకటి అతని చేతిలో పెట్టింది. అది అందుకోకుండా ఆ చేతిని పట్టుకొని ఎత్తి తన నోటిదాకా తీసికెళ్ళి ఆమె కళ్ళల్లోకి అదోలా చూశాడు, అంతే నోట్లో పెట్టమని కాబోలు. కళ్ళఎదుట శ్రీధర్ నవ్వుతూ కనబడ్డాడు. అబ్బా మనసా మీదాన్నేగాని, ఇతను నన్ను విడచిపెట్టడు కాబోలు. నన్ను నేను ఎలా రక్షించుకోను ప్రభూ! శ్రీధర్ మీ వాన్నిగానే వెళ్ళిపోనీయండి. అని అనుకుంటూఉండగా కడుపులో గిర్రున తిప్పింది. వెంటనే వాషింగ్ బేసిన్ వద్దకు వెళ్లి వాంతి చేసుకుంది. అతను గబగబావచ్చి భుజాలు పట్టుకొని ఏం? ఏమయింది? అంటూ గ్లాసులో నీళ్లు పట్టి మెల్లగా భుజంచుట్టూ చెయ్యివేసి బెర్తువరకు నడిపించుకొనివచ్చి కూర్చోబెట్టాడు. కొంతసేపటికి సర్దుకొని అబ్బే! ఏం లేదు మీరు పడుకోండి అంది. అలా క్కాదు. ఆ కిళ్ళీ వేసుకో కాస్త కడుపులో తిప్పు తగ్గుతుంది. అంటూ ఆమె వెంటనే వేసికోనందున తనే అది నోట్లో పెట్టబోయాడు. నాకువద్దు వడదు అంటూ ముఖం అటుప్రక్కకు తిప్పుకొంది. 'నీకు హోటల్ భోజనం అలవాటులేనట్లా వుంది' అని అన్నయ్యయిచ్చిన పండ్లు తెచ్చి పక్కనపెట్టి ద్రాక్షపళ్ళ గుత్తి చేతోపట్టుకొని ఒకటి తెంపి నోట్లో పెట్టబోయేడు. వారించబోయి తల తిరిగి వాలి అతనిమీదే పడింది, అతను అదే అనువుగా గట్టిగా పొదవి పట్టుకొని పడుకోబెట్టాడు. కళ్ళు మూసుకొని పడుక్కుంది అంతే, సినిమా రీళ్ళలా మళ్లీ కదలడం మొదలుపెట్టింది.

'ఫణి' ఒకనాడు ఎంతో కోపంతో ఇంట్లో అడుగుపెడుతూ అకదరిమీదా విసుక్కుంటూ ఏదో అందరి దురదృష్టంవల్లా, నేరంవల్లా అతనికి ఆపద సంభవించినట్టు అందరినీ చీదరించుకొంటున్నాడు. ఏం? జరిగిందని అడిగిందికి ఎవరికీ ధైర్యంలేదు. అమ్మ పనిలో ఉంది. అయినా ఆవిడ స్వభావం వేరు. ఎవరినీ పట్టించుకోదు. అదొక సజీవ ప్రతిమ. శారద పక్కింటివాళ్ళతో మేటనీ సినిమాకి వెళ్ళి అప్పుడే వస్తోంది. ఇంట్లోవున్న అమ్మ దగ్గరకి వెళ్లి కాఫీ అడిగింది. ఆవిడ రెండు గ్లాసులలో పోసి ఇచ్చింది. అంటె ఇంకా అన్నయ్య తాగలేదన్నమాట. అని అనుకుంటూ, కాఫీ గ్లాసు అన్నయ్య వున్న గదిలోకి తీసికెళ్ళింది. ముఖం దిగాలుగావుంది. ఏదో జరగకూడనిదే జరిగిందని గ్రహించింది శారద. అన్నయ్య ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లా[illegible]నే వుంటాడు. అలాటిది ఎందుకిలా ఉన్నాడా అన్నదే సమస్యగా ఉంది. అడిగేందుకు శారదకి ధైర్యం చాలలేదు. తన ఉనికిని తెలియజేస్తూ 'కాఫీ ఇదిగో!' అంటూ టేబిల్ మీద పెట్టింది. ఫణి ఇప్పుడు కాకపోయినా రేపైనా చెప్పాలికదా? అన్న ఉద్దేశంతో తన క్రోధం, కోపం, అన్నీ వెళ్ళకక్కుతూ "ఇక్కడ నా ఉద్యోగం అయిపోయింది. మళ్ళీ పునఃప్రయత్నం" అంటూ ఏం మాట్లాడకుండా కాఫీ తాగి వెళ్ళిపోయాడు.

అంతే మళ్ళీ రాత్రి 2 గంటలకి ఇంటికి వచ్చాడు. ఎవరితోనో మాట్లాడుతూ, శారద నిద్రపట్టక అటు ఇటు దొర్లుతూ ఆలోచిస్తోంది. కుటుంబ విషయాలు. ఇంతలో అన్నయ్య శేషుల సంభాషణ వినిపించింది. అమ్మ తలుపు తీసి ఉంటుందనుకుంది. ఏ ఇద్దరు మాట్లాడుకున్నా వినడం ఇష్టంలేని శారద వాళ్ళ సంభాషణ వింటూంది.

ఏం రా? ఫణి ఉద్యోగం ఎందుకు అయిపోయింది.

ఏం లేదురా శేషు! కథ మామూలే.

ఫణీ! నామాట విన్నావుకాదు. అది తప్పించి మరో ఆడపిల్ల లేదా? ఈలోకంలో. మీ ఆఫీసర్ నే పట్టుకు వెళ్ళాడమను. అంతకంటె అందమైనదాన్నే నీకు తెచ్చి అప్పగింతును. అందులోనూ వాడు నీపైఅధికారి. వాడితో పేచీ పెట్టుకొని ఉద్యోగాన్ని పోగొట్టుకున్నావు.

శేషూ! మొదట మా ఆఫీసరే పెళ్లి చేసుకొంటున్నాడు. ఇది తిన్నగా మా యింటికి వచ్చేయగలదు. అవతల పాతికేళ్లు పోతున్నాయి. మా నాన్న చంపేస్తాడు. ఇద్దరూ చెల్లెళ్ళున్నారు. వాళ్ళకు పెళ్లిళ్ళు చేయాలి. ఎలాఅయినా దీన్ని వదలుకొంటికి ప్రయత్నిస్తున్నాను అంటూ చాలా చెప్పాడు, అప్పుడు నేనే పెళ్లిచేసుకుంటానని 'కళ' తో చెప్పాను, ఎందరు అలా అని దాన్ని

ఉపయోగించుకోలేను. అంతగా పీకలమీదకివస్తే చదీ చవ్వను లేకుండా ఈ ఉద్యోగం మానేసి మరో ఊరు వెళ్లిపోదాం అని అనుకున్నాను. ఇంతలో మళ్లీ వాడే తయారైనాడు.

ఫణీ! మరి మీ చెల్లెలి పెళ్ళి ఎలా చేద్దామనుకుంటున్నావు?

నేనొక్కడినే ఉన్నానా? నామీద ముగ్గురు అన్నలున్నారు. వాళ్ళు ఎవరు పట్టించుకోలేదు బోలెడుకట్నం ఇవ్వాలి. మన కెందుకీ లేనిగొడవ. వయస్సు వచ్చింది అదే ఎవరినో చూసుకొంటుంది. లేదా! ఉద్యోగం చేసుకొంటుంది. అది వీలుపడకపోతే మనదగ్గరేపడిఉంటుంది

ఏంరా ఫణీ మరి అందరలోనూ చెల్లెకి పెళ్ళి చేస్తేగాని చేసుకోను ఎంతైనా కట్నం ఇస్తాను. లేదా ఎదురు బొదురు సంబంధంఅయినా చేసుకుంటాను. మాఅన్నయ్య అందరూ వదిలేస్తే నేనూ అలా చేస్తానా? మా బామ్మ అప్పచెప్పింది. ఆవిడకి చివరగా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అని పెద్ద కబుర్లు చెప్పావు. పెళ్లికి వయస్సు అక్కరలేదు గాని ఉద్యోగానికి వయఃపరిమితి ఉంది కదా? పోనీ ఏదైనా ఉద్యోగంలో చేర్పు.

ఆ! ఎందుకు నా అసమర్థత బయటపెట్టుకోవడం? ఎలాగూ నేను పైపూరు ఉద్యోగప్రయత్నం చేసుకుంటాను. అక్కడికి వెళ్లి ఒక ఏడాదిపాటు డబ్బు అది పంపి ఒక్కడినే ఉండడంకష్టం మీరు రండి అనివ్రాసేస్తాను వాళ్ళు రారు. మాఅమ్మకి పెద్దకొడుకంటే ప్రాణం వాడిదగ్గరగాని ప్రాణం వదలదు. నాకుహోటల్ భోజనం పడదు. అంటే వాళ్లే పెండ్లి చేసుకోమంటారు. ఓసారి వద్దని బెట్టుచేసి రెండవసారి వచ్చి చేసుకొని వెళ్ళిపోయాక ఎవరు ఎవరికి కొన్నాళ్లు ఏడుస్తారు. అదే ఏదో ఉద్యోగం చూసుకు టుంది. లేకా? మనకి తెలిసిన వాళ్లకి నలుగురికి నాలుగు ఉత్తరాలు వ్రాస్తే బయటి ప్రపంచం కూడా అయ్యో! ఫణి ఎంత మంచివాడు. పెళ్ళి చేస్తానంటూ ఉండేవాడు. అది ఎంతకీ కుదరకపోతే తల్లిని సంతోషపెట్టడానికి తను ఎంతో అయిష్టంతో పెళ్ళికి ఒప్పుకున్నాడు. తల్లీ చెల్లెల్ని రమ్మని ఎంతో బ్రతిమాలేడు. రాకపోతే ఆఖరుకి ఉద్యోగప్రయత్నం చేస్తున్నాడు అంటుంది. అసలు సంగతి ఎవరికి తెలుస్తుంది. నీలాటి వాళ్లు వీపున నాలుక వేసుకొని డబ్బాలా వాగకపోతే?

బాగుందిరా ఫణీ! బాగుంది నీ ప్లాను. మంచిబుద్ధున్న వాడివే ఏమిటో అనుకున్నాను ఇంకపడుకో. [illegible]గం. అయింది. అంటూ వెళ్ళిపోయాడు.

ఫణి సిగరెట్టు వెలిగించి మంచినీళ్ళు తాగి వెళ్ళి పడుకున్నాడు.

అన్నయ్యకి హైదరాబాద్‌లో ఉద్యోగం అయింది. అందరికద్దా సెలవు తీసుకొంటూ చాలా సంతోషంగా ఉన్నవాడు అమ్మ దగ్గరకు వచ్చి కళ్ళనిండా నీళ్ళుపెట్టుకొని అమ్మకి దండంపెట్టి ఏదో విధిలేక వెడుతూవున్నట్టు నాలుగడుగులు వేసి శారద దగ్గరకి వచ్చి తలపై చెయ్యివేసి కాసూ! ఎక్కడఉన్నా నీ సమస్యలన్నీ నావమ్మా అని అన్నితీరేవరకు నాకు శాంతి లేదమ్మా! అమ్మ జాగ్రత్త అని అంటూ వెళ్ళి రిక్షా ఎక్కి వెళ్ళిపోయేడు.

రెండు కేలండర్లు మారేయి. తను శేషూతో అన్నది అమలుజరపడానికి మొదలుపెట్టాడు. ఇవి ఏమీ అమ్మకు తెలియదు. శారద చెప్పలేదు. అక్కడ ఏదో మన జాతి కానివి, భాష కానివి సంబంధాలు చూసి వ్రాస్తూ వుండేవాడు. వాళ్లు నచ్చంటారుకదా అని. వీటిని అమ్మ అంగీకరించలేదు. ఇంతలో ఒకనెల సెలవుపెట్టి వస్తున్నానని వ్రాసి ఫణి వచ్చేడు. ఇంతకుముందే శేషుకి వ్రాసి ఒక సంబంధం స్థిరపరచుకుందికి వచ్చేడు. అన్ని తన చమత్కారంతోటి అప్పటికప్పుడు కుదిరినట్టు చెప్పి ఒకవారం గడువులో అన్నీ పూర్తిచేసుకొని హనీమూన్ వెళ్ళిపోయాడు.

ఇంతకుముందు శారద స్నేహితురాలు అకపిల్ల కాలేజీలో శారదకి ట్యూటర్ ఉద్యోగం వేయించింది. అది టెంపరరి అని ముందే చెప్పింది. వేసవి సెలవుల్లో జీతం ఇవ్వకపోయినా 3 సం॥ చెయ్యనిచ్చారు. తరువాత బి. ఎ. ఫస్టుక్లాసు వచ్చిన ఆమె పెద్ద రికమండేషన్‌తో వచ్చింది. ఈసారి శారదకి మళ్ళీ ఆ జాబ్ రాలేదు. ఆ మూడు సంవత్సరాలు ఫణి అప్పుడప్పుడు పంపినదానిలో ట్యూషన్ చెప్పినదానిలోనదుపుకొని మూడు వేలదాకా బ్యాంకులో వేసింది. శ్రీధర్ రాకపోతాడా? ఆ సొమ్ము అవసరం రాకపోతుందా? అన్నయ్యకు భారమవడం ఎందుకాఅని తనకు చాతనైనంతదాని ఉంచింది. ఇంతలో అన్నయ్యా పెద్ద సంఘసంస్కర్తలాగు కట్నంవద్దని వాళ్ళతో చెప్పివచ్చేడు. శేషూని ఇంటికితెచ్చి అమ్మతో చెప్పించాడు.

తల్లికి కొడుకు పెళ్ళి చేసుకుంటానంటే చాలా సంతోషంగాఉన్నా సొమ్ములేదే అని చాల బాధగాఉంది. కొడుకు సంగతి తెలియనిదికాదు, ఎప్పుడు ఒక్క కాని నిలవలో ఉండదు. శారద యింట్లోలేదు. హారిణి దగ్గరకు మళ్ళీ ఏదైనా టెంపరరీ ఉద్యోగం అయినా చేయిస్తుందని అడగడానికి వెళ్ళింది. ఫణికి అనుమానంగానే వుంది. శారద అంతా ఖర్చుపెట్టి ఉండదు. ఏదో కొంత దాచే ఉంటుంది. అని అనుకుంటూ ఆమె పెట్టెకి తాళం అదీ ఉండదని తెలిసి వెళ్ళి పెట్టె తెరచి అందులో ఏంవుందో

అని చదవ ప్రారంభించేను. అడుగున బ్యాంక్ ప్యాస్ బుక్ వుంది. తీసి చూశాడు. మూడు వేలు బ్యాలన్సు ఉన్నట్టు వుంది. ఇంతలో శారద వచ్చింది. అన్నయ్య తన పెట్టె దగ్గర ఉండడం చూసి నిర్ఘాంతపోయింది. అన్నయ్య చేతిలో బ్యాంక్ బుక్ చూసి మరీ ఆశ్చర్యపోయింది. వెనుదిరిగి వెళ్ళబోయింది. అటు వైపునుండి అమ్మ ఆనందంతో వెల్లివిరిసే ముఖంతో 'శారూ! అన్నయ్యకు పెళ్ళి కుదిరిందమ్మా' అని చెబుతూంది. ఇంతలో ఫణి తేరుకొని 'కట్నం వద్దన్నాను. నీవు పంపినవానిలో ఏమైనా మిగిలిందా శారదా!' అని అడుగుతున్నాడు. వెయ్యి రూపాయల జీతం తెస్తూ నెలకి నూరో నూట యాభైయో పంపుతూ మిగిలినవన్నీ జల్సాగా ఖర్చు చేస్తూ ఒక్కొక్క నెలలో ఇన్‌కమ్‌టాక్సు కట్టాలి, ఇన్‌ష్యూరెన్సు కట్టాలి అని అసలు పంపేవాడు కాదు, అందుకు శారదకు కళ్ళు నిండిపోయి 'అంతా నీదేలే' అంటూ ఆ పాస్ బుక్ తెచ్చి ఇచ్చేసింది. అమ్మ మాత్రం 'అయ్యో ఆ డబ్బు అది కష్టపడి సంపాదించుకొంది, అది వాడేస్తే రేపు దాని పెళ్ళి ఎలా అవుతుంది' అని అంటూంది. ఆఁ దాని పెళ్ళికేముంది నేను ఆమాత్రం చెయ్యలేనా? సంబంధం కుదరనివ్వు! కావలిస్తే ఖర్చుపెట్టి చెయ్యొచ్చు అన్నాడు నిర్లక్ష్యంగా, శారద మాత్రం మానసికంగా చాలా బాధపడింది. కోపంతో ఆనాడు అన్న మాటలు అన్నీ గుర్తు వచ్చి ఆ! దీనికి ఇంక పెళ్ళి కుదిరేదేమిటి కుదిరినా అంత ఖర్చుపెట్టి చెయ్యగల సంబంధం ఏముంది? ఏ రెండో పెళ్ళివాడో తప్ప అన్న నిర్లక్ష్యంలో అన్న మాటల్లా ఉంది అతని సమాధానం.

* * *

సాయంత్రం కావస్తోంది. సూర్యభగవానుడు దినమంతా పయనించి పశ్చిమాద్రి విశ్రాంతి తీసుకొందుకి చేరిందికి తొందరపడుతూ ఉన్నట్టుంది. తన వేడి వేడి చురుకైన కిరణాలు అలసి చల్లబడిపోతూ ఉన్నాయి. అలిసి ఎర్రబడ్డ ముఖంలా ఉంది సూర్యబింబం. రైలు తన గమ్యం చేరడానికి తొందరపడుతోంది. ఒక్కొక్క మైలురాయి దాటుతోంది. పక్క బెర్తుమీద ఉన్న అతను ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు. రేడియో సిలోన్‌లో తెలుగు పాటలు మొదలైనాయి ‘‘తలచినది జరిగినదా దైవం ఎందులకు? జరిగినదే తలచితివా శాంతి లేదు నీకు’’ అంటూ తన ప్రఖ్యాతమైన విషాదపూరితమైన కంఠంతో పి. బి. శ్రీనివాస్ అతి కమ్మగా గానం చేస్తున్నాడు. శారద నిజంగా ఆ పాట తనకే వర్తించినట్టు అనుభూతి పొందుతోంది. భుజంగం శారద పడుకున్న బెర్తుమీదకి వచ్చి పక్కన కూర్చున్నాడు. రెండు చేతులలోకి ఆమె ముఖాన్ని తీసుకొని చెక్కిళ్ళు నిమరబోయాడు. తుళ్ళిపడి ఆలోచనా ప్రవంతికి అడ్డువేసి కూర్చోబోయింది. అతను మీదికి వంగుతూ 'లేవకు నిద్రపోతున్నా వనుకున్నాను, లేచే ఉన్నావా? కాఫీ తీసుకుందాం' అంటూ అతని ముఖాన్ని ఆమె వదనానికి దగ్గరగా చేర్చబోయాడు. జీవితంలో ఉన్నవానితో ఎంత రాజీపడదామనుకున్నా శ్రీధర్ కళ్ళముందు నిలచి తన్ను కవ్విస్తున్నాడు చేతులు చాచి యిస్తున్నాడు. గబుక్కున లేచి చెదరిన చీరను సర్దుకోబోయింది. ఏం అలా వున్నావు? ఉదయంనుండి చూస్తున్నాను. నీ కోరిక మీదే కదా! ఈ ప్రయాణం. ఎంతో సంతోషిస్తా వనుకున్నాను. నీ ఎదుట నాఉనికే సహించలేనట్టు ఉంది నీ ప్రవర్తన. ఈ ముభావానికి కారణం తెలుసుకోవచ్చా? కొత్త అనుకోవడానికి మనం ఇంకా చిన్నపిల్లలం కాం కదా? అని చెయ్యిపట్టి లాగి కూర్చోపెట్టాడు.

‘‘అబ్బె! ఏం లేదు నాకు రైలు ప్రయాణం అలవాటు లేదు. అందుకే కడుపులో తిప్పింది’ అంది శారద.

ఈ ముభావం జీవితం పొడుగునా నే సహించలేను. మరో మనిషి ఉన్నట్టు నీవు గ్రహించడంలేదు. మాట్లాడటానికి సిగ్గేనా?

క్షమించండి. ఇలా మిమ్మల్ని శ్రమ పెట్టను. వీలైనంత తొందరలో మీరు సంతోషంగా ఉండేందుకే ప్రయత్నిస్తాను. (సశేషం)


# కథాంజలి

(చక్కని కథల మాస పత్రిక)

విడి ప్రతి ... 30 పైసలు.

సంవత్సర చందా ... రూ, 6-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, మరియు స్వదేశ మిత్రన్ బుక్ స్టాల్సులలోను దొరుకును.